అరవై ఇండ్లకు హైడ్రా నోటీసులు

ఆందోళనలో వెంగళరావునగర్ కాలనీ వాసులు

నలభై ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం: స్థానికులు • పార్క్‌జాగ కాపాడమంటే ఇండ్ల జోలికి వస్తారా: కార్పొరేటర్

హైదరాబాద్ సిటీబ్యూరో/వెంగళరావునగర్, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): 'హైడ్రా ఏర్పాటు కాకముందు ఉన్న నివాసాలకు పర్మిషన్లు ఉన్నా లేకున్నా వాటి జోలికి రాం.. వ్యాపార సముదాయాలు నిర్వహిస్తే మాత్రం ఊరుకోం'.. ఇది హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతంలో చేసిన ప్రకటన. కానీ ఇందుకు విరుద్ధంగా స్వయంగా రంగనాథ్ ఇంటికి అరకిలోమీటర్ దూరంలో ఉన్న వెంగళరావునగర్‌లో అరవైమంది ఇళ్ల యజమానులకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. నాలుగైదు దశాబ్దాలుగా ఇక్కడ నివాసముంటున్న వారికి నోటీసులు అందాయి. వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయం ఎదుట ఉన్న భూమిలోని నివాసాల యజమానులకు హైడ్రాలోని డిప్యూటీ సిటీ ప్లానర్ పేరిట నోటీసులు అందాయి. యూసఫ్‌గూడ గ్రామ సర్వే నంబర్లు 15,16,47,48లోని 44.38 ఎకరాల భూమిలో అక్రమంగా భవనాలు నిర్మించారన్న ఆరోపణలతో ఈ నోటీసులు ఇచ్చినట్టు హైడ్రా అధికారులు తెలిపారు. అయితే ఫిర్యాదుదారు, స్థానిక కార్పొరేటర్ దేదీప్య రావు మాత్రం తాను కేవలం రెండెకరాలకు సంబంధించిన స్థలం ఆక్రమణకు గురవుతున్నదని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హైడ్రాకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా, నోటీసులను ఈనెల 18వ తేదీన సిద్ధం చేయగా, యజమానులకు 19న అందజేశారు. నోటీస్ తేదీ నుంచి మూడు రోజుల్లో నివాసాలకు సంబంధించిన పూర్తి డ్రువీకరణ పత్రాలను హైడ్రా కార్యాలయానికి తీసుకురావాలని ఆదేశించారు. ఏండ్లుగా ఇక్కడే ఉంటున్న తమను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని వెంగళరావునగర్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలు అప్పగించినా, హైడ్రా ఏం చేస్తుందోననే భయంతో మదనపడుతున్నారు. ఈ ఏరియా స్థలం విషయంలో వివరాలు సేకరించాలని హైడ్రా ఏతః సుజిత్‌ను కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. సుజిత్ మాత్రం నోటీసులు ఇస్తామని, డాక్యుమెంట్స్ చూసిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని స్థానికులకు తెలిపారు.



HYDERABAD DISASTER RESPONSE & ASSET PROTECTION AGENCY

NOTICE

No. 5/HYDRAA/COMM/HYDRAA/2024 Date: 18-12-2024

Sub: HYDRAA - COMM - Furnish the documents required of Srinivasa heights, Situated at Landmark Construction, Vengal Rao Nagar, Hyderabad - Call for Documents - Issue of Notice - Reg.

Ref: 1. Complaint received at O/o Commissioner of HYDRAA, Dated: 16-10-2024.

*****

M. Srinivas Rao is requested to submit the following documents of Srinivasa heights, Situated at Landmark Construction, Vengal Rao Nagar, Hyderabad for verification.

i. Copy of Sanctioned Plan & its Proceedings.
ii. Copy of Registered Documents of property.
iii. Copy of Link Documents.
iv. Copy of Layout plan.
v. Details of Court cases (if any).

You are here by directed to furnish the above documents for verification within 15 days from the date of receipt of this notice failing which action will be initiated in accordance with due process of law.

Deputy City Planner,
Hyderabad Disaster Response & Asset protection Agency,
Hyderabad

To
Sri. M. Srinivas Rao,
Srinivas heights,
Landmark Construction,
Vengal Rao Nagar, Hyderabad.
Ph. No. 9866787771.

ఇండ్ల జోలికి వస్తే ఊరుకోం

వెంగళరావునగర్‌లో ఏడువేల నుంచి పదివేల ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాపై హైడ్రాకు అక్టోబర్‌లో ఫిర్యాదు చేశాం. దీనిపై విచారణ జరిపే సమయంలో కూడా నివాసగృహాల జోలికి వెళ్లొద్దని చెప్పాం. మాకు తెలియకుండా నోటీసులు ఇచ్చారు. ఇళ్లజోలికి వస్తే ఊరుకునేది లేదు.. హౌజింగ్ బోర్డు వాళ్లు ఇక్కడ 41 ఎకరాలకు సంబంధించి తమ పరిధిలోకి వస్తుందని చెప్పారు. మిగతా నాలుగెకరాలకు సంబంధించిన వ్యవహారంపై గొడవ జరగుతున్నది. ఇందులో రెండెకరాల స్థలం పార్క్‌దిగా హెచ్ఎండీఏ మ్యాప్‌లో ఉంది. దీనిపైనే మేం ఫిర్యాదు చేశాం. కానీ మిగతా రెండెకరాల విషయంలో కమిషనర్ అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు.

–కార్పొరేటర్ దేదీప్యారావు

హైదరాబాద్‌లో 8 చోట్ల ఈడీ సోదాలు

భారీగా నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు కలకలం రేపాయి. శుక్రవారం నగరంలోని 8 చోట్ల ఫైనాన్సియర్ల ఇండ్లలో ఏకకాలంలో జరిపిన ఈ సోదాల్లో రూ.72.75 లక్షల నగదుతోపాటు రూ.6.50 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ సామగ్రిని సీజ్ చేసినట్టు ఈడీ అధికారులు ప్రకటించారు. మనీ లాండరింగ్ జరుగుతున్నట్టు సమాచారం అందడంతో సురేష్ అగర్వాల్, రక్షిత అగర్వాల్, సీఎస్‌కే రియల్టర్ల ఇండ్లలో ఈ సోదాలు నిర్వహించినట్టు తెలిపారు.

సిరిసిల్లలో మరో నేతన్న ఆత్మహత్య

దూస గణేశ్ (ఫైల్)

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్20 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన దూస గణేశ్(50) మరమగ్గాల పనిచేసేవాడు. గణేశ్‌కు భార్య సువర్ణ, కూతుళ్లు సుమశ్రీ, పూజిత ఉన్నారు. గణేశ్ బజాజ్ ఫైనాన్స్‌లో పర్సనల్‌గా రూ.5 లక్షల అప్పు తీసుకున్నాడు. కొంతకాలంగా ఉపాధి లేకపోవడంతో కిస్తీలు కట్టలేదు. ఫైనాన్స్ వాళ్లు కిస్తీలు కట్టమనడంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. బజాజ్ ఫైనాన్స్ వాళ్లు ఇబ్బంది పెట్టడం వల్లే తాను చనిపోతున్నట్టు సూసైడ్ లేఖ రాశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గణేశ్ నేతన్న బీమాలో చేరినట్టు చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ తెలిపారు.

ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థిని మృతి

- దవాఖానకు తరలించే సరికే డీఎడ్ విద్యార్థిని మృత్యువాత
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బీసీ హాస్టల్‌లో విషాదం

వెంకట లక్ష్మి (ఫైల్)

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 20 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీసీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో ఉంటూ స్థానిక శ్రీనిధి డీఎడ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తొర్రం వెంకటలక్ష్మి (19) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందింది. తోటి విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం అందుగులపల్లికి చెందిన వెంకట లక్ష్మి వారంక్రితం డీఎడ్ పరీక్షల కోసం రాగా, శుక్రవారం మధ్యాహ్నం భోజన చేసిన అనంతరం అస్వస్థతకు గురైంది. తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది కలిసి స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతికి గల కారణం తెలియరాలేదు. పోస్టుమార్టం తర్వాతే స్పష్టత వచ్చే అవకాశమున్నది. వెంకటలక్ష్మి అనారోగ్యంతోనే మృతి చెంది ఉండవచ్చని బీసీ సంక్షేమశాఖ అధికారి సజీవన్ తెలిపారు. హాస్టల్ వార్డెన్ వారం రోజులుగా అందుబాటులో ఉండడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ అత్మహత్య

యాదగిరి (ఫైల్)

రాయపోల్,డిసెంబర్ 20 : అప్పుల బాధ భరించలేక సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లిలో ఆటోడ్రైవర్ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లికి చెందిన పంగ యాదగిరి (48) బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆటో కొనుగోలుకు, కుటుంబాన్ని పోషించడానికి అప్పులు ఎక్కువయ్యాయి. ఆటో నడిపినా అంతంతమాత్రంగానే ఆదాయం రావడంతో డబ్బులు సరిపోక తీవ్ర మనస్తాపం చెందాడు. దీంతో వారం క్రితం స్వగ్రామం కొత్తపల్లికి వచ్చి పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనం ద్వారా గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. యాదగిరికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రాయపోల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తన చావుకు కారణం లింగాల ఎస్సై అంటూ వీడియో రిలీజ్

అచ్చంపేట/లింగాల, డిసెంబర్ 20 : ఎస్సై బెదిరింపులు, వేధింపులు తాళలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ యువకుడు పురుగుల మందు డబ్బాతో ఉన్న వీడియో నాగర్‌కర్నూల్ జిల్లాలో వైరల్‌గా మారింది. యువకుడి కథనం మేరకు.. లింగాల మండలం అప్పాయిపల్లికి చెందిన ఆవుల పురుషోత్తంకు చెందిన పొలం పక్కన ఉన్న మరో మహిళా రైతు నుంచి వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. ఈ విషయం తెలుసుకొన్న ఎస్సై నాగరాజు అతడి బంధువైన పెద్దమల్లయ్యకు పొలాన్ని ఇప్పించే విషయమై పురుషోత్తాన్ని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సెల్‌ఫోన్ లాక్కొన్నాడు. 'నా సంగతి తెల్వదు.. నాతో పెట్టుకుంటావా.. నీపై అట్రాసిటీ కేసు నమోదు చేసి రౌడీషీటర్ ఓపెన్ చేసి నీ సంగతి చెప్తా'.. అంటూ అనరాని మాటలతో ఎస్సై బెదిరించాడు. నా చావుకు ఎస్సై నాగరాజుదే బాధ్యత'.. అంటూ వీడియో చిత్రీకరించాడు. కాగా, భూమి విక్రయంలో ఈరమ్మ, మల్లయ్యను పురుషోత్తం బెదిరించాడని ఎస్సై నాగరాజు తెలిపారు. మల్లయ్య ఫిర్యాదు మేరకు పురుషోత్తంను స్టేషన్‌కు పిలిచి మంచి పద్ధతి కాదని చెప్పానని వివరించారు.

తెలంగాణ 3 ప్రాజెక్టుల డీపీఆర్‌ల తిరస్కరణ

తెలంగాణ ప్రాజెక్టుల డీపీఆర్‌ల తిరస్కరణ

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి సంబంధించిన మూడు ప్రాజెక్టుల డీపీఆర్‌లను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తిరస్కరించింది. ఈ మేరకు రాష్ట్ర సాగు నీటిపారుదలశాఖ ఈఎన్సీకి తాజాగా లేఖ రాసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్ధా పథకం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం 3వ టీఎంసీ పనులకు సంబంధించిన డీపీఆర్‌లను సీడబ్ల్యూసీ తిప్పి పంపింది. వార్ధా ప్రాజెక్టుకు సంబంధించి అంతర్రాష్ట్ర ఒప్పందం, ముంపునకు సంబంధించిన వివరాలు, ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే చేసిన నిర్మాణాల వినియోగం, ఆయకట్టు వివరాలను ఇవ్వాలని సీడబ్ల్యూసీ కోరింది. కాళేశ్వరం 3వ టీఎంసీకి సంబంధించి అనేక అంశాలకు సంబంధించిన పలు అంశాలపై వివరణ కోరింది. ఎన్నిసార్లు అడిగినా తెలంగాణ ప్రభుత్వం వివరాలను ఇవ్వడం లేదని, ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టుల డీపీఆర్‌లను తిరస్కరిస్తున్నట్టుట్టు సీడబ్ల్యూసీ ఆ లేఖలో వెల్లడించింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు సంబంధించిన జలాలపై న్యాయవివాదం కొనసాగుతున్న నేపథ్యంలో దానిని సైతం తిరస్కరిస్తున్నట్టు సీడబ్ల్యూసీ లేఖలో స్పష్టం చేసింది.

జేవీ కంపెనీలపై చర్యలు

- ఒప్పందం రద్దు చేసిన హౌసింగ్ బోర్డు
- కోట్ల విలువైన ఆస్తుల సీజ్

హైదరాబాద్, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): ఒప్పందాన్ని ఉల్లంఘించిన మూడు జాయింట్ వెంచర్(జేవీ) కంపెనీలపై చర్యలు తీసుకున్నట్టు తెలంగాణ హౌసింగ్ బోర్డు వెల్లడించింది. కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దుచేసుకోవడంతో పాటు ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బండ్లగూడలోని ఇందూ ఈస్టర్న్ ప్రావిన్స్ ప్రాజెక్ట్స్‌కు సంబంధించి 50ఎకరాల్లో రూ. 417కోట్ల విలువైన 10.418ఎకరాలు, కూకట్‌పల్లిలో మధుకాన్ ప్రాజెక్ట్స్‌కు కేటాయించిన 9.04ఎకరాల్లో రూ.600కోట్ల విలువైన 7.92ఎకరాలు, గచ్చిబౌలిలో యూనివర్సల్ రియల్టర్స్‌కు కేటాయించిన 19.95ఎకరాల్లో నిర్మించిన రూ.208కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేసినట్టు వెల్లడించారు. 2005-2007 మధ్యకాలంలో హైదరాబాద్, వరంగల్, ఖమ్మంలో 20జేవీ ప్రాజెక్టులు చేపట్టగా, అందులో 12 పూర్తయ్యాయని, మిగిలిన 8 ప్రాజెక్టుల్లో కొన్ని కోర్టు కేసుల్లో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

మర్రి జంగిరెడ్డి మృతి

నాగర్‌కర్నూల్ , డిసెంబర్ 20: బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి శుక్రవారం రాత్రి మృతి చెందారు. వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతో ఆయన మరణించారని సన్నిహితులు తెలిపారు.

అమెరికాలో బోధన్ విద్యార్థి మృతి

నీరజ్‌గౌడ్ (ఫైల్)

బోధన్, డిసెంబర్ 21: అమెరికాలో జరోడ్డు ప్రమాదంలో బోధన్‌కు చెందిన విద్యార్థి మృతి చెందాడు. రాకాసిపేట గౌడ్స్ కాలనీకి చెంది న శంకర్‌గౌడ్, నీరజ దంపతుల కుమారుడు పంజాల నీరజ్‌గౌడ్ (23) అమెరికాలోని న్యూ హెవెన్ సిటీలో ఎంఎస్ చదువుతున్నా డు. తన స్నేహితుడు శ్రీధర్‌తో కలిసి ఈ నెల 16న బ్రిడ్జిపోర్టు ప్రాంతానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. దట్టమైన పొగమంచు ఆవరించడంతో కారు అదుపు తప్పి పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని దవాఖానకు తరలిస్తుండగా, నీరజ్‌గౌడ్ మార్గ మధ్యలో మృతి చెందాడు. శ్రీధర్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్‌కు అస్వస్థత..

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 20 : అస్వస్థతతో ఆర్టీసీ డ్రైవర్ స్టీరింగ్ మీదపడిపోగా, బస్సు అదుపుతప్పి రెండుకార్లు, మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న గోదావరిఖని డిపో బస్ మోర్ మార్కెట్ సమీపంలోకి రాగానే.. డ్రైవర్ లాకిని ఎల్లయ్య అస్వస్థతతో స్టీరింగ్ మీద పడిపోయాడు.

ఇదీ అఫిడవిట్టేనా?

- ఎమ్మెల్సీ కోదండరాంపై కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం
- జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ పైనా అసంతృప్తి
- ఎవరైతే ఏంటి..? రూల్స్ ఫాలో కావాలంటూ చురకలు

హైదరాబాద్, డిసెంబర్20 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంపై కాళేశ్వరం కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేయడమే కాకుండా, ఎవరైతే ఏంటి రూల్స్ ఫాలో కావాలంటూ చురకలంటించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట శుక్రవారం ప్రొఫెసర్ కోదండరాం, వెదిరె శ్రీరాం హాజరయ్యారు. ఇప్పటికే వారిద్దరూ ప్రాజెక్టుకు సంబంధించి పలు అంశాలపై కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్లపై జస్టిస్ ఘోష్ విచారణ జరిపారు. తొలుత వెదిరె శ్రీరామ్‌ను విచారించారు. శ్రీరామ్ అందజేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న సీడబ్ల్యూసీ నుంచి తీసుకున్న సీఈ సీడీవో లెటర్‌కు, అధికారులిచ్చిన లేఖకు తేడా ఉండటాన్ని గమనించిన జస్టిస్ ఘోష్ ఇదేమిటని నిలదీశారు. అయితే, ఆ లేఖను నేరుగా సీడబ్ల్యూసీ నుంచే తీసుకున్నానని, తేడాలు ఎందుకున్నాయో తెలియదని వెదిరె శ్రీరామ్ బదులివ్వగా, సీడబ్ల్యూసీకి నోటీస్ ఇచ్చాకే ఆ లెటర్‌ను పొందారా? అని కమిషన్ ప్రశ్నించింది. తాను జలశక్తి సలహాదారుగా పనిచేస్తున్నానని, కాళేశ్వరానికి సంబంధించిన పలు మీటింగుల్లోనూ పాల్గొన్నానని, ఆ హోదాలోనే సీడబ్ల్యూసీ నుంచి లేఖ తీసుకున్నట్టు చెప్పడంతో జస్టిస్ ఘోష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎవరైనా సరే, అది పబ్లిక్ డాక్యుమెంటైనా కూడా పద్ధతి ప్రకారం పొందాలని, ఆ రూల్స్‌ను ఫాలో కానప్పుడు ఆ డాక్యుమెంట్‌ను ఎలా పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ ఘోష్ ప్రశ్నించారు. కోర్టులు ఇలాంటి డాక్యుమెంట్లపై ఆధారపడబోవని తేల్చిచెప్పారు.

కోదండరాంపై ఆగ్రహం

అనంతరం కమిషన్ చేపట్టిన బహిరంగ విచారణకు కోదండరాం హాజరయ్యారు. ఆయన అందజేసిన అఫిడవిట్‌ను పరిశీలించిన జస్టిస్ ఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు అది అఫిడవిట్టేనా? ఆధారాలేవీ లేకుండా అఫిడవిట్ ఎలా సమర్పిస్తారు? దాఖలు చేసే విధానం ఇదేనా? అని ప్రశ్నించారు. ఇందుకు నిర్ణీత నమూనాలో సోమవారం ఆధారాలు సమర్పిస్తానని కోదండరాం సమాధానమివ్వగా, ఇప్పటికే 90 రోజులు గడువిచ్చామని, కోర్టులు అంతకు మించి టైమ్ ఇవ్వబోవని జస్టిస్ ఘోష్ తేల్చిచెప్పారు. అఫిడవిట్‌పై సంతకం, అఫిడవిట్‌కు జత చేసిన కొన్ని పత్రాలపై అటెస్ట్ చేసిన సంతకం మీవేనా? అని జస్టిస్ ఘోష్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీని కూడా పెట్టినట్టున్నారు కదా? అని అడిగారు. అనంతరం 2016 నుంచి 2019 వరకు మైనర్ ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన, ప్రస్తుత స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌ను జస్టిస్ ఘోష్ ప్రశ్నించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో మీ రోల్ ఏమిటి? బరాజ్‌లకు సంబంధించిన పాలసీ డెసిషన్ ఏమైనా తీసుకున్నారా? అని ప్రశ్నించారు. తాను మైనర్ ఇరిగేషన్, భూసేకరణ అంశాలను మాత్రమే చూశానని, బరాజ్‌లకు సంబంధించిన నిర్ణయం, నిర్మాణం వరకు జరిగిన అంశాల్లో తనకు ఎలాంటి సంబంధం లేదని వికాస్‌రాజ్ సమాధానమిచ్చారు.

రిపోర్టులిస్తేనే మేడిగడ్డపై తుది నివేదిక

- తేల్చిచెప్పిన ఎన్‌డీఎస్‌ఏ
- కోరిన సమాచారం ఇవ్వడంలేదని ఇరిగేషన్ శాఖపై మండిపాటు
- డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా మరోసారి లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): నిర్దేశించిన పరీక్షల నివేదికలను తెలంగాణ ప్రభుత్వం అందజేస్తేనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు తదుపరి చేపట్టాల్సిన చర్యలు, సిఫారసులకు సంబంధించి తుది నివేదికను ఇస్తామని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) మరోసారి స్పష్టంచేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిత రిపోర్టులను ఇవ్వకపోవడం వల్లే తుది నివేదిక సమర్పణకు జాప్యమవుతున్నదని పేర్కొన్నది. ఇప్పటికైనా తాము కోరిన సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి ఎన్‌డీఎస్‌ఏ డైరెక్టర్ అజయ్‌కుమార్ సిన్హా తాజాగా మరోసారి లేఖ రాశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించిన నిర్మాణ లోపాలపై అధ్యయనం చేసి, వాటి నివారణకు సంబంధించి తగు సూచనలు చేసేందుకు ఎన్‌డీఎస్‌ఏ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ గతంలోనే క్షేత్రస్థాయిలో సందర్శించి రాష్ట్ర అధికారులకు పలు సూచనలు చేసింది. నాణ్యత, డిజైన్, భూ భౌగోళిక పరిస్థితులు, వరద ప్రవాహాల స్థితిగతులు తదితర అంశాలకు సంబంధించిన పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ఎస్, సీఎస్ఎంఆర్ఎస్ వంటి సంస్థలో చేయించాలని, అందుకు సంబంధించిన నివేదికలను అందజేయాలని సూచిస్తూ మధ్యంతర నివేదికను అందజేసింది. ఆ నివేదికను సమర్పిస్తే, వాటిని అధ్యయనం చేసి తుది నివేదికను సమర్పిస్తామని ఎన్‌డీఎస్‌ఏ గతంలోనే వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఆ రిపోర్టులను సమర్పించలేదు. ఈ నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఏ పాలసీ, రీసెర్చ్ వింగ్ డైరెక్టర్ అజయ్‌కుమార్ సిన్హా ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్‌కు లేఖను రాశారు. నిర్దేశిత పరీక్షల రిపోర్టులను సమర్పించేలా తెలంగాణ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర సాగు నీటి పారుదల శాఖ సెక్రటరీకి సైతం లేఖ రాశారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X@SCRailwayindia
దమ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఓపెన్ టెండర్ నోటీస్ నెం.B-E29-TRD-TNDR-18-24-25, తేది: 18.12.2024 PUB/1285/24

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు IREPS లో టెండర్లు కోరుతున్నారు. **టెండరు నోటీస్ నెం.B-E29-TRD-TNDR-18-2024-25**

పని పేరు: SW-1-విజయవాడ డివిజన్-MCS-MCS/RJY వద్ద మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు MEMU కోచ్ మెయింటెనెన్స్ సౌకర్యాల మెరుగుదల మరియు LL బే నుండి షంటింగ్ నెక్ (రెండవ ఎంట్రీ) కనెక్ట్ చేయుటకు సంబంధించి OHEకు మార్పులు చేర్పులు-450 మీటర్లు. SW-2-విజయవాడ డివిజన్-MCS-MCS/RJY వద్ద మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు MEMU కోచ్ మెయింటెనెన్స్ సౌకర్యాల మెరుగుదల మరియు BZA ఎండ్ వైపు 40 మీటర్ల పాత మునిగిపోయిన గుంట ఎక్స్‌టెన్షన్‌కు సంబంధించి OHEకు మార్పులు చేర్పులు. SW-3-విజయవాడ డివిజన్-MCS- MCS/ RJY వద్ద మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు MEMU కోచ్ మెయింటెనెన్స్ సౌకర్యాల మెరుగుదల మరియు BZA ఎండ్ వైపు 90 మీటర్ల కొత్త మునిగిపోయిన గుంట ఎక్స్‌టెన్షన్‌కు సంబంధించి OHEకు మార్పులు చేర్పులు.
సుమారు విలువ: రూ.61,20,139.74, **పూర్తి చేయు కాలం:** 12 నెలలు, బిడ్ సెక్యూరిటీ (బయానా): రూ.1,22,400, ముగింపు తేది: 10.01.2025న 15.00 గం. **టెండర్ ఫారం ధర:** రూ. లేదు.

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ టిఆర్‌డీ/ విజయవాడ

ఇ-టెండర్ నోటీస్ నం.GNT/SG/36/314, తేది: 18.12.2024 PUB/1286/24

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు 10.01.2025న 12.00 గం.వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

ID No.:314, **పని పేరు:** దిగువ వాటికి సంబంధించి S & T పని: గుంటూరు డివిజన్‌లో 1) GNT-NDL సెక్షన్‌లో 10 పంతెనలు, 34 స్పాన్స్ కొరకు PSC స్లాబ్స్‌తో ప్రస్తుతమున్న స్టీల్ గిర్డర్స్ రిప్లేస్‌మెంట్. 2) GNT-NDKD-PGDP సెక్షన్‌లో 9 పంతెనలు, 35 స్పాన్స్ కొరకు PSC స్లాబ్స్‌తో ప్రస్తుతమున్న స్టీల్ గిర్డర్స్ రిప్లేస్‌మెంట్. 3) MRGA-KDGL స్టేషన్ మధ్య కి.మీ.83/6-7 వద్ద RUB 138B (LC No.48) యొక్క లో హైట్ అడిషనల్ వెంట్ వే ఏర్పాటు చేయుట. 4) NRDP-VLGA స్టేషన్ మధ్య కి.మీ.26/2-3 వద్ద RUB 48A (LC No.12) యొక్క లో హైట్ అడిషనల్ వెంట్ వే ఏర్పాటు చేయుట. 5) NLDA-RYGA స్టేషన్ మధ్య కి.మీ.80/5-6 వద్ద RUB 138A (LC No.47) యొక్క లో హైట్ అడిషనల్ వెంట్ వే ఏర్పాటు చేయుట. 6) PDGL-NDKD స్టేషన్ మధ్య కి.మీ.147/8-9 వద్ద RUB 353A (LC No.95) యొక్క లో హైట్ అడిషనల్ వెంట్ వే ఏర్పాటు చేయుట. 7) KADM-MRGA స్టేషన్ మధ్య కి.మీ.106/1-2 వద్ద RUB 181A (LC No.65) యొక్క లో హైట్ అడిషనల్ వెంట్ వే ఏర్పాటు చేయుట. **సుమారు టెండర్ విలువ:** రూ. 2,41,72,985/-, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ. 2,70,900/- **టెండర్ డాక్యుమెంట్ ధర:** రూ. లేదు.

1. ఇ-బిడ్డ ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది: 10.01.2025న 12.00 గం. వరకు దాఖలు చేయవచ్చును. సవివరమైన సమాచారం కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.inకు లాగాన్ అవ్వండి. 2.ఏదేని తదుపరి సమాచారం/ సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.inద్వారా మాత్రమే తెలియజేయబడును.
సీనియర్ డివిజినల్ సిగ్నల్ & టెలికాం ఇంజినీర్/